# స్త్రీహృదయము

రచన : దేవగుప్తాపు సావిత్రి దేవి

మెడ్రాసు మెయిలు బెజవాడలో 7 గంటలకు ఆగింది. లేడీస్ థర్డ్ క్లాసు బండిలో నుంచి చాలా మంది దిగిపోయారు. కొంతమంది కాఫీకని, నీళ్లకని దిగేరు. ఆ బండిలోనే కలకత్తా వెళ్తూవున్న ఒక బంగాలీయువతి బెడ్డింగు విశాలముగా సర్దుకొని, చేతిలో ఆరు నెలల పిల్లను పడుకోబెట్టి, కాళ్ళు ఎదురు బల్లమీదికి జాపుకొని ఆకాస్త అవకాశము పోగొట్టుకొనుట ఎందుకు అన్నట్లు ఠీవిగా కూర్చున్నది. ఇంకో పదినిమిషాలకు రైలు కదులుతుందనగా అదరాబాదరాగా చంకలో ఒక పిల్లవాణ్ని, చేతిలో ఒక బుట్టతో ఒక పల్లెటూరిపిల్ల ఎక్కింది. ఎందుకో అంతా ఆ పిల్లను చూడ్డం మొదలెట్టేరు. చంకలోని పిల్లవాడు అందర్నీ చూచి పలకరిస్తున్నాడు, ఆవిడ అసలైన పల్లెటూరి యువతిలాగ అమాయకంగా, తెల్లగా నవనవలాడుచున్న శరీరముతో, బెదరుచూపులతో బెంగాలీయువతి కాళ్ళదగ్గర నిలబడింది. ఆవిడ ఆమెను ఏగాదిగా చూచి "మర్యాద తెలియదు. చదువులేని పశువు" అని ఇంగ్లీషులోగొణుక్కొంటూ కాళ్ళుతీసి విధిలేక కాళీచేసింది స్థలం.

కూలీ ఆవిడపెట్టి, బెడ్డింగ్ తీసికొచ్చి పైన పెట్టేడు. కిటికీలోంచి "పెట్టి జాగ్రత్త, పిల్లవాడు పడిపోతాడు. మళ్ళీ స్టేషనులోవస్తా," నని ఒక మొగగొంతుక కేకేసిపోయింది. రైలు కదిలింది. అంతా సర్దుకొని కూర్చున్నారు. బండిలోని వాళ్ళంతా పిల్లవాణ్ణి పలుకరిస్తున్నారు. అందరికీ తారంగం, చెప్పి, దోబూచులాడిస్తూన్నాడు పిల్లవాడు.

రైలు కదలడములో ఒక్క ఊపు ఊపింది. అంతా ముందుకు వెనక్కి గుద్దుకున్నారు. పైనుంచి ఏదో ఒకపెట్టి కుదుపుకి బెంగాలీ పాపమీద పడింది. పాప కెవ్వు మన్నది. అంతా గొల్లుమన్నారు. ఎవరులాగేరో గొలుసు రైలు ఆగింది. గార్డు, జనం మూగేరు. "డాక్టరు, డాక్టరు" అన్న కేకలు వినిపించేయి. డాక్టరువచ్చిచూచాడు. పెదిమ విరిచాడు గార్డునుచూచి, డాక్టరు పిల్లవాడిని గార్డుపెట్టెలో కట్లుకట్టు డానికే తీసుకుపోయాడు. బెంగాలీ యువతి గోలపెడ్తున్నా పక్కవాళ్ళని చూసుకొమ్మని వెళ్ళిపోయాడు పిల్లవాడితో సహా. అంతా పావుగంట జరిగింది. పాపం బెంగాలీయువతి గోలుగోలునఏడుస్తున్నది. పెట్టి ఎవరిది అన్నప్రశ్న వచ్చింది. పల్లెటూరి పిల్లది. అంతా విచారపడ్డారు. జాగ్రత్త పెట్టుకోవద్దు? తనపిల్ల అయితే తెలుసు, ఒంటిమీద స్పృహ ఉంటేగా ఈ పల్లెటూరి వాళ్ళకి. ముందు వెనక చూచుకోరు. అందులో పల్లెటూరు మొద్దు అంటూ ఎవరికీతోచింది వారు అనడం మొదలు పెట్టేరు. అమ్మాయి తన పెట్టిపడిందే అని ఒక్కలాగ ఏడుస్తోంది. దానికితోడు వారి మాటలలో మరింత ఏడ్వగానే చేతిలోని పిల్లవాడు తల్లిని కౌగలించుకుని కెవ్వు మన్నాడు. ఇంతవరకు ప్రక్కన వున్న ముసలమ్మ నీవేమి చేస్తావు తల్లీ అందరిలాగునే నీవు పెట్టి పెట్టుకున్నావు. వాళ్ళకేం నోటికివచ్చిన మాటలాడుతారు. ఊరుకో అది భగవంతుని లీల అంది.

అంతా మళ్ళీ సర్దుకొని కబుర్లు చెప్పుకుంటున్నారు. అంతవరకు ఏడుస్తున్న బెంగాలీయువతి ఒక గ్లాసు మంచినీళ్ళు త్రాగి కళ్ళుతుడుచుకొని ఏదో సీరియస్‌గా ఆలోచిస్తూ తల్లి ఒడిలోనున్న కుఱ్ఱవాణ్ని చూస్తూ కూర్చున్నది. అంతా పాపం గుండె రాయి అయిపోయింది. అనుకొన్నారు.

రైలు వెళ్తునేయున్నది. బెంగాలీయువతి దబుక్కునలేచి నాలుగు ప్రక్కలచూచి; తల్లి చంకలోని పిల్లవాణ్ని బలవంతాన్ని లాగుతోంది. ఎవరికి ఏమితోచలేదు. పల్లెటూరియువతి అమ్మో అయ్యో అని అంటునేయున్నది. ఏమిటమ్మా కుఱ్ఱవాణ్ని లాగుతావంటునే యున్నారు. ఎవరి మాట వినిపించికోకుండా ఆ అమాయకపు కుఱ్ఱవానిని కిటికీలోంచి అవతలకు గిరవాటు వేసినది. అయ్యో ఇదేమి రాక్షసకృత్యమో అంటో గొల్లుమన్నారు. పల్లెయువతి నిలువునా కూలిపోయింది. మళ్ళీ రైలాగింది. అంతా వెనక్కు పరుగెత్తేరు. రిపేరు చేయడానికి పోసిన ఇసుక తిప్పలో తువ్వాలుచుట్టుకొని కొనఊపిరితో ఒళ్లు తెలియక పడియున్నాడు ఆపసికందు.